ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 11 సెప్టెంబరు 2025 | 5



నిలకడగా గోదావరి 6
» 3.11లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..
ప్రజా సమస్యలపై గళం
» కాకినాడలో ఉమ్మడి జిల్లా జడ్పీస్థాయి సంఘాల సమావేశం 7



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులు

భీమేశ్వరుడి సేవలో కలెక్టర్ దంపతులు

ద్రాక్షారామ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సతీసమేతంగా బుధవారం సందర్శించారు. వీరికి ఆలయ అర్చకులు, ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గా భవానీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, సర్పంచ్ కొత్తపల్లి అరుణ స్వామివారి ప్రసాదం అందచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు ఉన్నారు. కలెక్టర్ మహేష్ కుమార్ జన్మదినం పురస్కరించుకుని స్వామిని దర్శించుకున్నారు.

జలజీవన్ మిషన్ నిధులు రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు 7

గుడ్డు.. బ్యాడ్డు..



» గుడ్డు ధర దోబూచులాట
» మొన్నటి వరకు బాగున్నా.. తాజాగా పతనం
» రైతు ధర రూ.5.45.. చేతికి దక్కేది ఐదే
» మరోవైపు పడిపోయిన దిగుబడులు
» బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర రూ.7

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లకు మంచి ధర పలకడంతో పౌల్ట్రీ రైతులు ఎంతో ఆనందపడ్డారు. అయితే ఈ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. కొద్దిరోజులుగా రైతుకు దక్కే గుడ్డు ధర అంతకంతకూ దిగజారిపోతోంది. ప్రస్తుతం గుడ్డు ధర పేపర్ రేటు ప్రకారం రూ.5.45కు పడిపోయింది. ఇది కూడా రైతుకు పూర్తిగా దక్కడం లేదు. ఈ ధరలో ఏజంటు కమిషన్ రూ.0.25 పైసలు పోతుంది. అంతేగాకుండా ట్రేడర్లు నిర్ణయించిన కమింగ్ రేటు ప్రకారమే ఇప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి. దాంతో రైతు చేతికి రూ.5 మాత్రమే దక్కుతోంది. ఈ ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదని పౌల్ట్రీ రైతులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి కోళ్లకు ఇటీవల పలు రకాల తెగుళ్లు రావడంతో కోళ్ల సంఖ్య పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.30 కోట్ల కోళ్ల ఉండగా, వీటి సంఖ్య 90 లక్షల వరకు పడిపోయింది. దీంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అయ్యే గుడ్లు ప్రస్తుతం 65 లక్షల నుంచి 70 లక్షలకు పడిపోయాయి. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురై కోళ్లు చనిపోవడంతో గుడ్లకు గిరాకీ పెరిగి గుడ్డు ధర రూ.5.90 వరకు ఎగబాకింది. అయితే గత పది రోజులుగా గుడ్డు ధర పడిపోవడం ప్రారంభించి ప్రస్తుత ధర రూ.5.45పైసలుగా ఉంది. ఉత్పత్తి తగ్గినా గుడ్డు ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంబరపడినంత సమయం కూడా లేకుండా పతనం దిశగా పయనిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలకాలంలో ఒడిసా సహా ఇతర రాష్ట్రాల్లో పౌల్ట్రీల సంఖ్య పెరగడంతో ట్రేడర్లు కూడా మన గోదావరి ప్రాంత ఎగుమతులపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం కమింగ్ ధరకే ప్యాకేజీలు జరుగుతుండడంతో పేపర్ ధర రూ.5.45 ఉన్నప్పటికీ ఏజంటు కమిషన్ 0.25 పైసల భారం ఎలాగూ రైతుపైనే పడుతోంది. అంతేకాకుండా అక్కడి ట్రేడర్లు నిర్ణయించిన ధరనే కమింగ్ రేటుగా పరిగణించడంతో ప్రస్తుతం రైతు చేతికి రూ.5.00 మాత్రమే చేరుతోంది. ప్రస్తుతం కొత్త బ్యాచ్‌లు వేయడంతో అవి గుడ్డు పెట్టే దశకు చేరుకునేందుకు మరో నాలుగైదు నెలల సమయం పడుతుందని, అప్పటివరకు ఇదే పరిస్థితి కొనసాగితే తాము నష్టాల బారిన పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఫీడ్ ధరలో పెద్దగా మార్పు లేకపోవడంతో టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని, గుడ్లు ఉత్పత్తి పెరిగే వరకు రూ.6.00 పైబడి ధర పలికితే గాని తాము కోలుకోలేమని రైతులు అంటున్నారు. వచ్చే శీతాకాలంపైనే ఆశలు పెట్టుకున్నామని, అప్పటికైనా ధర పెరిగితే నష్టాలు తగ్గుతాయని చెబుతున్నారు.

మార్కెట్‌లో ఇష్టారాజ్యం

వినియోగదారుల కోణంలో చూస్తే కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6.50 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి ఏడున్నర వరకు విక్రయాలు సాగుతున్నాయి. దాంతో చాలా దారుణంగా కోడిగుడ్ల ధరలు పెరిగిపోయాయని సామాన్యులు గగ్గోలుపెడుతున్నారు. పౌష్టికాహారం కోసం ఎక్కువగా గుడ్లనే వినియోగిస్తున్నందున అధిక భారం పడుతోందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రైతు వద్ద ధరలు తగ్గుతుండడంతో అటు హోల్‌సేల్‌లోనూ, ఇటు రిటైల్‌లోనూ ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి మాత్రం రిటైల్‌లో ఏడు రూపాయల ధరలోనే విక్రయాలు సాగుతుండడం గమనార్హం.

కోళ్ల పరిశ్రమకు పూర్వవైభవం చంద్రబాబు చేతుల్లోనే ఉంది



రాష్ట్రంలో ఏ పరిశ్రమ ఎలా ఉంది, ఎవరికి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలిసిన విధంగా మరే ముఖ్యమంత్రికి తెలియదనడంలో అతిశయోక్తి లేదు. 2014లో ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను తెలుసుకుని అనేక రాయితీలు కల్పించారు. ప్రస్తుతం పరిశ్రమ అప్పటికన్నా మరింత సంక్షోభంలో ఉంది. ప్రభుత్వపెద్దలు కోళ్ల పరిశ్రమపై దృష్టి సారించి పరిశ్రమను ఆదుకుంటారని రైతులంతా ఎదురు చూస్తున్నారు. - పడాల సుబ్బారెడ్డి, రాష్ట్ర కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

'ఆటో' పేమెంట్





ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించింది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆర్థికంగా ఆదుకోనున్నట్టు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆటోవాలాలకు ఆర్థిక సాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్లు అనంతపురం సభలో బుధవారం అధికారికంగా ప్రకటించడంతో ఆటో కార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి.

» ఆటో కార్మికులకు ప్రభుత్వం తీపికబురు
» స్త్రీశక్తి పథకం నేపథ్యంలో నష్టపోతున్న ఆటోవాలాలకు ఏటా రూ.15 వేలు
» దసరా రోజున పథకం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సీఎం చంద్రబాబు
» ఉమ్మడి జిల్లాలో 46 వేల ఆటో కార్మికులకు రూ.69 కోట్ల వరకు ఆర్థిక లబ్ధి
» ఇప్పటికే హరిత పన్ను తగ్గించడంతో ఆటోలకు భారీగా తగ్గిన పన్ను భారం

(కాకినాడ,అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. ఆటో కార్మికుల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ప్రకటించారు. సూపర్‌సిక్స్ పథకాల సక్సెస్ సందర్భంగా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గత నెల 15వ తేదీ నుంచి మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కారణంగా ఆటోడ్రైవర్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కొన్ని రోజుల నుంచి ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటోకార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఒక్కో ఆటోవాలాకు అక్టోబరు 2న విజయదశమి రోజున ఆటో కార్మికులకు రూ.15వేల వంతున సాయాన్ని అందిస్తామని సీఎం చేసిన ప్రకటనతో ఆటో కార్మికుల్లో సంబరాలు మిన్నంటుతున్నాయి. పూట గడవడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం వేలాది ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా నింపనుందని ఆటో కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 వేల వరకు ఆటోలున్నాయి. ఇందులో కాకినాడ జిల్లాలో 13,194, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 17వేల వరకు ఆటోలున్నట్టు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆటోయూనియన్లు మాత్రం 50 వేలపైనే ఆటోలు ఉంటాయని చెబుతున్నాయి. ఈ పథకం అమలైతే ఉమ్మడి జిల్లాకు రూ.69 కోట్ల వరకు నిధులు కావలసి ఉంది.

అప్పట్లో ఊరించి ఊరించి అరకొరే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించారు. అదీ లబ్ధిదారులను ఎడాపెడా కోసేసి సంఖ్య తగ్గించేశారు. పైగా ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ అయిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీవోలను రంగంలోకి దించింది. చలాన్ల పేర్లతోను, రవాణాశాఖ నిబంధనల పేరుతోను రకరకాల ఫైన్‌లు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకునేది. పైగా వాహనమిత్ర పథకాన్ని కొంతకాలమే అమలుచేసి గాలికి వదిలేశారు. ఇక దసరా నుంచి అమలుకానున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు జారీచేయనుంది. పథకానికి అర్హత సాధించడానికి నిబంధనలపై స్పష్టత ఇవ్వనుంది. సొంత ఆటో ఉన్నవారు, అలాగే అద్దెకు తీసుకుని నడుపుతున్న కార్మికులు ఉమ్మడి జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈనేపథ్యంలో సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనేదానిపై స్పష్టత రానుంది. ఇదిలా ఉంటే గతంలో ఆటోలు ఉన్నప్పటికీ ఆటో నడిపే లైసెన్సు, బ్యాడ్జీలు కలిగిన వారికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కొత్త మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. దీనిపై కోనసీమ జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాల ద్వారానే ఎంత మంది లబ్ధిపొందుతారనేది తేలనుందని చెప్పారు.

మేలో హరిత పన్నుతో ఆనందం..

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరిత పన్ను పేరుతో ఎవరినీ వదలకుండా రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. లారీలు, టిప్పర్లు, కార్లు, ఆటోలు, స్కూలు బస్సులు, చివరకు బైక్‌లను కూడా పన్ను పేరుతో జేబులు గుల్లచేసేసింది రవాణా, రవాణాయేతర రంగాలకు సంబంధించి ఆయా వాహనాల నుంచి ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ అధికారులు హరితపన్నును వసూలు చేసేవారు. బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరితపన్నును భారీగా పెంచేసింది. సాధ్యమైనంత డబ్బును కోట్లలో పిండుకునేందుకు 2022 జనవరి 1 నుంచి హరితపన్ను పెంపును అమలుచేసింది. అప్పటిదాకా రూ.200 ఉన్న పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసేసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడు నుంచి పదేళ్లు అయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు పది నుంచి పన్నెండేళ్లదాటితే ఒక త్రైమాసికం పన్ను విలువ, 12ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రవాణా, రవాణాయేతర వాహనాలపై భారీగా పన్ను భారం పడింది. పెరిగిన పన్ను భారం భరించలేక వాహనదారులంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆటోవాలాలకు భారీగా పన్ను భారం తప్పింది.

రూ.4కోట్లతో వీరేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం 7
» ఆలయాన్ని పరిశీలించిన స్థపతి పరమేశ్వరప్ప

తామరపూలే వికసించెనే!
» పంట మార్పిడి విధానంతో తామరపువ్వుల సాగు
» అరవిరిసిన పుష్పాలతో రైతులకు లక్ష్మీ కటాక్షం
» దైవ కార్యాలకే కాదు.. ఆయుర్వేద వైద్యానికి కూడా.. 6

తీర ప్రాంతాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో ప్రణాళికలు

» మత్స్యసంపద అభివృద్ధి, మొగ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి
» గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యకారగ్రామాల్లో మత్స్య సంపద అభివృద్ధితోపాటు సముద్రతీర ప్రాంతంలో తరచూ ఉత్పన్నమవుతున్న ముంపుసమస్యల నివారణకు చమురుసంస్థలు సహకారం అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సీఎస్ఆర్ నిధులతో తీరప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఓఎన్జీసీ ఇంజనీర్ కేవీకే రాజు గ్రీన్‌యూనిట్ ఎన్జీవో దుర్గేష్ గుప్తాతోపాటు వివిధశాఖలఅధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఇటీవల చంద్రబాబు పర్యటనలో ఇచ్చిన హామీల్లో భాగంగా కాట్రేనికోన మండలం చెయ్యేరులో మంచినీటి అభివృద్ధి పనులు, కూనవరం మొగద్వారా ముంపునీరు దిగేందుకు డ్రైనేజీలను అభివృద్ధి చేయడం..తీరంలో రక్షణకోసం మడఅడవుల అభివృద్ధి, గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.క్షేత్రస్థాయిలో వీటిపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈనెల 20న జరిగే సమీక్షకు మరోసారి హాజరుకావాలని సూచించారు. కందికుప్ప, వాసలతిప్పల్లో అభివృద్ధి కార్యాచరణ పనులతో తదుపరి సమీక్షకు అటవీశాఖ అధికారులు రావాలన్నారు. డీఆర్వో మాధవి, మత్స్యశాఖాధికారి శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ శంకరరావు, గ్రీన్ క్లైమెట్ ఫండ్ అధికారి హర్ష, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, సీపీవో మురళీకృష్ణ, డీఎఫ్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



అమలాపురంలో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

అమలాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రంలోని గదులు, ల్యాబ్‌లు, చికిత్సా విధానాలను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. కేంద్రం సమకూర్చిన పరికరాల ద్వారా మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆరోగ్య కేంద్రానికి ఏదైనా సహకారం కావాల్సివస్తే తాను అందిస్తానని హామీఇచ్చారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్య విధానం ప్రజల ఆరోగ్య సంరక్షణకు లక్ష్యంగా సేవలందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంటువ్యాధులు ఇతర రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర మందులు, ఉచిత రోగ నిర్ధారణ వ్యవస్థలు, అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెలనెస్ సెంటర్లను ఆధునికీకరించి ఆరోగ్య మందిరాలుగా అభివృద్ధి చేశారన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనరు బి.నిర్మలకుమార్, తహశీల్దారు ఆశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఆర్వో మాధవి

అమలాపురం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):కలెక్టర్ మహేష్‌కుమార్‌కు కలెక్టరేట్‌లోని వివిధశాఖల అధికారులు బుధవారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లోఉన్న మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.డీఆర్వో మాధవి, డీఐపీఆర్వో శ్రీనివాస్, వెంకటరామరెడ్డి, మత్స్యశాఖాధికారి శ్రీనివాసరావు, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ ఏపీడీ రామచంద్రగాంధీ, హౌసింగ్ పీడీ నరసింహారావు, ఎస్‌డీపీ పి.కృష్ణమూర్తి కలెక్టరేట్ ఉద్యోగులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకెప్పుడు?

» పుష్కర కాలం దాటిపోయినా చేనేత సహకార సంఘాల ఎన్నికల ఊసే లేదు
» కూటమి ప్రభుత్వం తొలినాళ్లలో ఎన్నికల హడావిడి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి పుష్కర కాలం దాటిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత చేనేత సంఘాలకు ఎన్నికలే నిర్వహించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013, ఫిబ్రవరి 8న ఎన్నికలు జరిగాయి. 2018తో పాలకవర్గాల గడువు ముగిసింది. ఎన్నికలు జరిగిన పన్నెండునరేళ్లు అవుతున్నా ఇంత వరకు చేనేత సంఘాల ఎన్నికల ఊసే లేకుండా పోయింది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. వరుసగా గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. మరి అప్పుల ఊబిలో కూరుకుపోయి కోట్లాది రూపాయల బకాయిలు విడుదల కాక చేనేత సహకార సంఘాలు మిణుకుమిణుకుమంటున్నాయి. కొన్ని సంఘాలు అప్పుల భారంతో మూతబడితే మరికొన్ని మూబడేందుకు సిద్ధంగా ఉన్నాయి. 2018 నుంచి చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వాలు పర్సన్ ఇన్‌చార్జిలను అధికారులను నియమిస్తూ కాలం గడిపేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి టెంటేటీవ్ షెడ్యూల్‌ను విడుదల చేయడంతో జిల్లాలోని చేనేత జౌళిశాఖ అధికారులు అప్పట్లో ఎన్నికలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇది జరిగి ఏడాది గడిచిపోయినా ఎన్నికల ఊసే లేదు.

ఉమ్మడి జిల్లాలో 55 చేనేత సంఘాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో 11,244మంది సభ్యులు ఉన్నట్టు చేనేత జౌళిశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీస్ రూల్-1964ను అనుసరించి గతేడాది అక్టోబరులో చేనేత జౌళిశాఖ సహకార సంఘాలకు టెంటేటీవ్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 2024, అక్టోబరు 21న ఎన్నికల అధికారులను సైతం సంఘాల వారీగా నియమించింది. 2024, డిసెంబరు 4న ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాలోని చేనేత జౌళిశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ ఎన్నికలు మాత్రం జరగలేదు. మళ్లీ ఏడాది గడిచిపోయింది. ఇప్పుడేమో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను సైతం సిద్ధం చేసింది. కానీ పుష్కరకాలం దాటిపోయినా చేనేత సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంపట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో 23చేనేత సహకార సంఘాల్లో 5,426మంది సభ్యులు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 18 పాత సంఘాలు, ఐదు కొత్త సంఘాలతో కలిసి 23 సంఘాల్లో 3,312మంది సభ్యులు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 9 చేనేత సహకార సంఘాల్లో 2,506మంది సభ్యులు ఉన్నారు.




ఆదివారపుపేటలో మూతబడిన చేనేత సహకార సంఘం

అడిగేవారులేక అప్పుల ఊబిలోకి..

చేనేత సహకారసంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఆప్కో నుంచి రావాల్సిన బకాయిల గురించి, ప్రభుత్వం చెల్లించాల్సిన పాత రాయితీల గురించి అడిగేవారే లేకుండాపోయారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు అప్పటివరకు అమలు జరుపుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను, రాయితీలను రద్దుచేసింది. కూటమి ప్రభుత్వంలో త్రిఫ్ట్‌ఫండ్ పథకాన్ని మాత్రమే పునరుద్ధరించారు. ఆ నిధులూ కార్మికులకు విడుదల కాకుండా సీఎఫ్ఎంఎస్‌లోనే ఉండిపోయాయి. త్రిఫ్ట్‌ఫండ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని చేనేత కార్మికులకు రూ.55లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఆప్కో ఒక్క కోనసీమ జిల్లాలోనే చేనేత సహకార సంఘాలకు రూ.6కోట్ల మేర బకాయి ఉండగా వాటిలో ప్రత్యేకంగా లివరీ చేనేత సంఘాలకు రూ.2.5కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి
-చింతా శంకరమూర్తి, బండారులంక



ఎంపీకి విన్నవిస్తున్న శంకరమూర్తి

ఏళ్ల తరబడి అధికారుల ఏలుబడిలో ఉన్న చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. బకాయిలు అడిగేందుకు పాలకవర్గాలు లేకపోవడంతో సంఘాలు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. చేనేత వస్త్రాలపై 30శాతం రిబేటును పునరుద్ధరించడంతోపాటు త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. గతంలో అమలులో ఉన్న ఉచిత వర్కుషెడ్ల పథకం,నూలుపై సబ్సిడీ, మార్కెటింగ్ ఇన్సెంటీవ్ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని ఎంపీ గంటి హరీష్‌బాలయోగికి వినతిపత్రం అందించాం.



- పంట మార్పిడి విధానంతో తామరపువ్వుల సాగు
- అరవిరిసిన పుష్పాలతో రైతులకు లక్ష్మీ కటాక్షం
- దైవ కార్యాలకే కాదు.. ఆయుర్వేద వైద్యానికి కూడా
- మార్కెట్‌లో భలే డిమాండ్



తామర పూలే... వికసించెనే!

'కలువకు చంద్రుడు ఎంతో దూరం.. కమలానికి సూర్యుడు మరీ దూరం. దూరమైన కొలదీ పెరుగును అనురాగం' అని ఆచార్య ఆత్రేయ అన్నట్టుగానే సూర్యోదయం అవుతుందంటే చాలు పురివిప్పిన నెమలి నాట్యమాడుతున్నట్టుగా చెరువులు, చేలల్లోని కమలాలు విచ్చుకుంటూ మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. భారతదేశ జాతీయ పుష్పం తామరపువ్వే. ఈ పువ్వును కమలం, పద్మం, అరవిందం, జలజం, అంబుజం వంటి ఎన్నో పేర్లతో పిలుస్తారు. తామరపువ్వులు ప్రధానంగా పూజలు, వ్రతాలు, యజ్ఞ యాగాది క్రతువులకు వినియోగిస్తుంటారు. తామర పువ్వుల్లోని ఔషధ గుణాలను గుర్తించి నేడు ప్రకృతి వైద్య విధానంలో వినియోగిస్తున్నారు. అంతేకాదు. ఆయుర్వేద మందుల తయారీకి తామరపువ్వులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

అటువంటి తామర పువ్వులను వరి పొలాల్లో పంట మార్పిడి విధానంగా సాగులోకి తీసుకువచ్చారు కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు. ఈయన తన స్వగ్రామంతో పాటు అమలాపురం రూరల్ మండలం జనుపల్లిలో పంటమార్పిడి విధానంలో తామర పువ్వులు పండిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. తనతో పాటు మరో 17 మంది ఇదే తరహాలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పొలాలను లీజుకు తీసుకుని తామర పువ్వులు సాగు చేస్తూ లాభాల పంట పండిస్తున్నట్టు చెప్పారు.

బురదలో పుట్టినా దేవుని పాదాల చెంతకే...

తామర పువ్వులు మనిషికి ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. బురదలో పుట్టినప్పటికీ ఎటువంటి మలినాలు అంటకుండా దేవుని పాదపద్మాల చెంతకు చేరుకుంటున్నాయి. మనిషి ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ చెడు ప్రభావానికి లోను కాకూడదు. తామరపువ్వులను ప్రధానంగా లక్ష్మీపూజతో పాటు అమ్మవారి పూజలకు విశేషంగా వినియోగిస్తారు. విష్ణుపూజతో పాటు యజ్ఞ యాగాది క్రతువుల్లోనూ వినియోగిస్తారు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, కార్తీక మాసంలో వీటిని విరివిగా వినియోగిస్తారు. ఈ పువ్వులను లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. ఎవరి ఇంటైనా వ్రతం జరుగుతుంటే ముందుగా వీటినే సిద్ధం చేసుకుంటారు.

ఆరోగ్య ప్రదాయినిగా....

ఆయుర్వేద వైద్యంలో తామర పువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. తామర పువ్వుల రేకలు, కాడలను గుండె జబ్బుల నివారణతో పాటు కామెర్లు, అతిసార వ్యాధి నివారణకు వినియోగిస్తారు. తామరపూల రసం రక్తస్రావాన్ని తగ్గించడంతో పాటు మూల వ్యాధి, దగ్గు నివారణకు, చర్మవ్యాధులు, కుష్టు వ్యాధి నివారణకు వినియోగించే మందుల తయారీలో వినియోగిస్తారు. తామర పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు తామరపువ్వుల టీ తాగితే ఉపశమనం పొందవచ్చు. తలనొప్పి, జ్వరానికి కూడా మందుగా పని చేస్తుంది. తామర పువ్వుల టీ తాగితే కార్డియాక్ అరెస్టు వంటి గుండె సంబంధిత సమస్యలు తగ్గుతాయి. తీవ్రమైన ఒత్తిడి ఆందోళనకు గురయ్యే వారికి దివ్య ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. పంట మార్పిడి విధానంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. దాంతో భక్తులకే కాదు వైద్య రంగానికి కూడా ఎంతో అవసరమైన తామరపువ్వుల సాగును రైతులు ఇప్పుడిప్పుడే ఎంచుకున్నారు. భద్రాచలం నుంచి దుంపలు తెచ్చి కడియం నుంచి రాజోలు వరకు మిత్రులతో కలిసి తామరపూల సాగు చేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు తెలిపాడు. కొందరు పశ్చిమ గోదావరి జిల్లాలో సాగు చేస్తున్నారన్నారు. ఎకరాకు రూ.25వేలు చొప్పున పెట్టుబడి పెడుతున్నాం. ఏటా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు తామరపువ్వులకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇక ఆయుర్వేద వైద్యం కోసం మరికొందరు ఈ పూల కోసం వస్తున్నారని వీరబాబు తెలిపాడు. మేజర్ డ్రెయిన్ల వెంబడి తొలకరి సాగు ముంపునకు ప్రాంతాలనే ఎంపిక చేసుకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో పొలాలను లీజుకు తీసుకుని తామర సాగు చేస్తున్నాం.




దసరా, కార్తీక మాసాల్లో మంచి డిమాండ్

వాసంశెట్టి వీరబాబు, కడియం



దేవి శరన్నవరాత్రులతో పాటు కార్తీక మాసంలో తామరపువ్వులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం జనుపల్లి పేరాయిపేటలో డాక్టర్ గొలకోటి రంగారావుకు చెందిన పొలంతో పాటు ఆరు ఎకరాల్లో తామర సాగు చేస్తున్నాం. రబీ సీజన్‌లో యథావిధిగా వరిసాగు చేస్తాం. ప్రస్తుతం పితృ పక్షం జరుగుతుంది. ఈ పక్షం రోజులు అంతగా అమ్మకాలు ఉండవు. అన్ సీజన్‌లో రూ.6కే పువ్వును విక్రయించాల్సి వస్తుంది. సీజన్‌కు అందుబాటులో వచ్చే విధంగా సాగు చేస్తుంటా. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు లాభం వస్తుంది. రానున్న సీజన్‌లో పొలం వద్దే ఒక్కో పువ్వు రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయిస్తాం. పూల వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. యజ్ఞాల కోసం ఒక్కొక్కరు 120 పుష్పాలు చొప్పున తీసుకెళ్తారు. ప్రస్తుతం ఎక్కడచూసినా తామర పువ్వు దొరికితే చాలు అన్న పరిస్థితి ఉంది. అయినా మేము మాత్రం ఎక్కువ రేటు చేసి అమ్మం. ఎందుకంటే అన్ సీజన్‌లో ఎలా ఉంటుందో చూస్తున్నాం.



ఈవీఎంలే కీలకం

పంచాయతీ ఎన్నికల్లో తప్పనున్న తిప్పలు

సులభతరం కానున్న కౌంటింగ్

ఆలమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలంటే అధికారులకు, సిబ్బందికి సవాలే. ఒకే రోజు పోలింగ్, అదే రోజు లెక్కింపు అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక. ఇదంతా జరిగేటప్పటికి కొన్ని గ్రామాల్లో తెల్లవారుతుంది. రాత్రంతా ఎంతో క్లిష్టమైన ఓటంగ్ లెక్కింపు ప్రక్రియ ఉద్యోగులకు పెద్ద సవాల్. రాష్ట్ర ఎన్నికల కమిషనరు స్థానిక పంచాయతీ ఎన్నికలకు ఈవీఎంలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మంగళవారం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా సాధ్యం

పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఈవీఎంలతో ఎలా సాధ్యమవుతుందనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే కౌటింగ్ ప్రక్రియ సులభతరం కానున్న తరుణంలో ఓటింగ్ ప్రక్రియలో మార్పులు తీసుకురానున్నారు.

అదెలా ఉంటే...

పంచాయతీ ఎన్నికలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమయం ఉంటుంది. తిరిగి రెండు గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

ఈవీఎంలతో ఎన్నిక నిర్వహిస్తే ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 లేదా 4 గంటల వరకు పోలింగ్ జరిగేలా ఏర్పాటు చేయనున్నారు.

అలా చేయడం వల్ల ఓట్లు పోలింగ్ బూత్‌ల సంఖ్య తగ్గనున్నాయి.

అదెలాగంటే..

ఎలాగంటే మేజర్ పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడం వల్ల ఒక్కో వార్డుకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఇప్పుడు ఈవీఎంలు పెట్టడం వల్ల, ఓటింగ్ పోలింగ్ సమయం పెంచడం వల్ల వార్డుకు అన్ని పంచాయతీలకు ఒక బూత్ పెట్టి, సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యునికి ఒక ఈవీఎం ఏర్పాటుచేస్తే సరిపోతుంది.

లెక్కింపు ప్రకియ సులభతరం ఇలా..

ఇప్పటివరకు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి కౌంటింగ్ మొదలుపెట్టి ముందుగా బ్యాలెట్లను కట్టలు కటేవారు.

ఆ కట్టలు ఎక్కించిన సరిపోయిన అనంతరం వార్డు సభ్యులు ఓట్లు సర్పంచ్ ఓట్ల వేరు వేరుగా లెక్కింపు చేపట్టడం తలకి మించిన భారంగా మారేంది. అన్నిటికంటే ముఖ్యంగా ఓటు ముద్ర సరిగా పడని బ్యాలెట్లు లెక్కింపు పెద్ద వివాదాస్పదమయ్యేది. ఆ ఓటు తమదంటే తమదని లెక్కింపు ఏజెంట్లు ఘర్షణకు దిగి కొన్ని సమయాల్లో కొట్లాటకు దారితీసేది. ఇలా అన్ని వివాదాలు పరిష్కరించడం, పోలీసు, పంచాయతీ శాఖల అధికారులకు స్టేజ్-2 ఆఫీసర్లకు నానా ఇబ్బందికరంగా ఉండేది.

కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు తలెత్తకుండా చిన్న, పెద్ద పంచాయతీ సమస్య లేకుండా ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ఎంతో సులభతరం కానుంది. ఓట్ల లెక్కింపు అనతరం ఉప సర్పంచ్ ఎన్నికను కూడా ఆ రోజు సాయంత్రానికే పూర్తి చేసే అవకాశం ఉంది.

గతంలో ఓట్ల ఎక్కింపు తెల్లవారుజాము వరకు జరగడం వల్ల ఉప సర్పంచ్ ఎన్నికలు చాలాచోట్ల వాయిదాపడేవి. వాటిని మరో రోజు నిర్వహించడం సమస్యగా మారేది.

2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 1050 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 9, 13, 19, 21 తేదీల్లో నాలుగు దశలుగా ఈ ఎన్నికలు నిర్వహించారు. 2020-21 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏప్రిల్ 3న వీరంతా పదవీ బాధ్యతలు చేపట్టారు.

నూతన సాంకేతికతపై పట్టుసాధించాలి

- మిషన్ లెర్నింగ్ విప్లవంతో భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చు
- ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతపై పట్టుసాధించి గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మిషన్ లెర్నింగ్ విప్లవంతో మెకానికల్ ఇంజనీర్లు భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చునని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ మనం కొత్తయుగంలో ఉన్నామన్నారు. డేటా ద్వారా నడిచే యుగం అల్గోరిథంల ద్వారా నడిచే శక్తిని పొందుతుందని మన ఊహ ద్వారా మాత్రమే పరిమితం అవుతుందన్నారు. మెటీరియల్ సైన్స్, అర్థశాస్త్రం, వైద్య, సాహిత్యం లేదా కళలు ఏ రంగమైనా మీరంగంలోని క్లిష్టసవాళ్లను పరిష్కరించడానికి మిషన్ లెర్నింగ్ శక్తివంతమైన లెన్స్‌ను అందిస్తుందన్నారు. మిషన్ లెర్నింగ్ పై పట్టుసాధించాలని, ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.బి. వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ మిషన్ లెర్నింగ్ ప్రాథమికాంశాలు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ కె.శ్రీహర్షరెడ్డి, అధ్యాపకులు బి.లక్ష్మి, కె.దుర్గారావు పాల్గొన్నారు.

రూ. 92.5 కోట్లతో ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం


రివైజ్డ్ డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న అధికారులు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా లోని ప్రాచీన మూడు ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పర్యాటకశాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖాధికారులు రూ.92.5కోట్లతో రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రివైజ్డ్ డీపీఆర్‌ను బుధవారం అధికారులు అనపర్తిలో ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయం, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయం, పెదపూడి మండలంలోని గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో డీపీఆర్ తయారు చేశారన్నారు. దీనిపై ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి మార్పులు చేయాలని సూచించగా మరలా రివైజ్డ్ డీపీఆర్‌ను రూ.92.5 కోట్లతో తయారు చేశారన్నారు. దీనిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రులకు ఈసదర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

యోగా క్రీడాకారిణి మహిమకు అభినందన


మహిమను సత్కరిస్తున్న యోగా గురువు చిట్టిబాబు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఇటీవల ద్వారకా తిరుమలలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ ఏపీ స్టేట్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ -2025 పోటీలలో కాకినాడ నగరానికి చెందిన మేడిశెట్టి మహిమ 30-35 ఏజ్ కేటగిరిలో స్టేట్ సిల్వర్ మెడల్ సాధించి, రాబోయే డిసెంబర్‌లో బీహార్, రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ యోగా విద్య పీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మెయిన్ రోడ్‌లోగల రాక్ యోగా స్పోర్ట్స్ అకాడమీలో నేషనల్ యోగాసన కోచ్ డి.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో స్టేట్ విన్నర్‌కు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యోగా గురువు చిట్టిబాబు స్టేట్ సిల్వర్ మెడల్ విన్నర్ మహిమని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం యోగా కోచ్ డి.ఎస్.ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, జాతీయ పోటీలలో పాల్గొనే యోగా క్రీడాకారులను ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో యోగా శిక్షకులు కల్పన, భారతి, అర్జునరావు, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

- 3.11లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 3,11,526 క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలద్వారా 14,300క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2400క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.30 అడుగులుగా నమోదైంది.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు రూ.10,10,106 విరాళం


టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుకు చెక్కు అందజేస్తున్న అనంత శ్రీనివాస్ దంపతులు

గోకవరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం వెదురుపాక మాజీ సర్పంచ్, తంటికొండ దేవస్థానం కమిటీ సభ్యుడు బొట్టా రామకృష్ణ సోదరుడు తలారి అనంత శ్రీనివాస్, తార దంపతుల కుమార్తె హసిత శ్రీఐశ్వర్య పేరుపై బుధవారం టీటీడీకి విరాళం అందజేశారు. టీటీడీ అన్నదాన ట్రస్ట్ నిమిత్తం రూ.10,10,106ల చెక్కును జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ తిరు మల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడికి శ్రీనివాస్ దంపతులు అందించారు. శ్రీనివాస్, తార కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు.



ఇంటింటికీ తాగునీరు

జలజీవన్ మిషన్ నిధులు రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

- 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు
- గోదావరి జలాలను నేరుగా ప్రాజెక్టుకు తరలింపు
- ఉమ్మడి జిల్లాను ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజన
- పైపులైన్ ఏర్పాటుకు డీఐ పైపుల సిద్ధం



కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరంలో డీఐ పైపులతో ట్రాలీలు

పి.గన్నవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతిఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం జలజీవన్‌మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ముఖ్యఉద్దేశ్యం శివా రు ప్రాంతాల్లోను ఇంటింటికీ తాగునీరు అంది ంచడం. ఈ క్రమంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి జలజీవన్ మిషన్ నిధులు రూ.1650కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును రూపకల్పన చేసింది. 30ఏళ్లపాటు తాగునీరు అంది ంచేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ పథకం ద్వారా 2011 జనాభా లెక్కల ప్రకారం 24.92 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే కాలంలో మరో పదిలక్షల జనాభా పెరిగినా ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరం దించే లక్ష్యంగా చెప్తున్నారు. జలజీవన్‌మిషన్ నిధుల్లో కేంద్రం సగం నిధులిస్తే.. మరో సగం నిధులు రాష్ట్రం మంజూరు చేయాల్సి ఉంది. శివారు ప్రాంతాలకు సైతం వేసవిలోను తాగునీరును పుష్కలంగా అందించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. కాల్వనీరుతో సంబంధం లేకుండా నేరుగా గోదావరి జలాలతో తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును తెరమీదకు తీసుకువచ్చారు. కాల్వనీరు రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారై కలుషితం అవుతున్న తరుణంలో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు రావడం శుభపరిణామమే. ఈ పథకం టీడీపీ హ యాంలో తెరమీదకు వచ్చినప్పటికీ అప్పట్లో వైసీ పీ ప్రభుత్వం వచ్చి ముందుకు తీసుకురావడంలో విఫలమైంది. పనులు ప్రారంభించకుండానే టెం డర్లు సైతం రద్దయినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటర్‌గ్రిడ్ పథ కంపై ప్రత్యేక దృష్టి కనబరిచింది. దీంతో ఇటీవలే ఈ టెండర్‌ను మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. ఇప్పటికే మండలాలవారీగా ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు సర్వే పూర్తి చేయగా సంబంధిత కంపెనీ మళ్లీ సర్వే, డిజైన్‌లు సిద్ధం చేసింది.

బొబ్బర్లంక నుంచి సఖినేటిపల్లి వరకు..

బొబ్బర్లంకలో ప్రారంభమైన పైపులైన్ అమలాపురం కెనాల్ చెంతనే పలివెల వరకు వస్తుంది. అక్కడ నుంచి అవిడి నుంచి విడిపోయిన పైపులైను వయా నరేంద్రపురం మీదుగా పి. గన్నవరం వస్తుంది. అవిడి నుంచి మరో పైపు లైన్ వయా ముక్కామల, గంగలకుర్రు మీదుగా బండారులంక చేరుకుంటుంది. అలాగే పి.గన్న వరం నుంచి ప్రారంభమైన పైపు లైను జగ్గన్న పేట వచ్చి ఒకటి మామిడికుదురు వరకు వెళ్తుం ది. జగన్నపేట నుంచి ప్రారంభమైన మరో పైపు లైను సఖినేటిపల్లి మండలం వరకు చేరుకుంటుంది. అలాగే ఈస్ట్రన్‌డెల్టాలో కూడా రూపొందిన డిజైన్ మేరకు పైపు లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు పైపు లైను ఏర్పాటు నిమిత్తం గ్రామాల్లోకి 5.5 మీటర్లు పొడవు గల డిఐ (డక్టైల్ ఐరన్ పైప్) పైపులు చేరుకుంటున్నాయి. పి.గన్నవరం మండల పరిధిలో పోతవరానికి డీఐ పైపులతో కూడిన ట్రాలీలు అధిక మొత్తంలో చేరుకున్నాయి. పైప్‌లైన్ ఏర్పాటు నిమత్తం ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతులు తీసుకోవల్సి ఉందని పూర్తిస్థాయిలో అనుమతులు సిద్ధం చే సుకుని పనులు ప్రారంభిస్తారని అధికారులు చెప్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 35 మండలాలకు తాగునీరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదటి దశలో 35 మండలాలకు సంబంధించి 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. బొబ్బర్లంకలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రా వాటర్ ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి పైపులు ద్వారా ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్‌లకు పంపిస్తారు. అక్కడి నుంచి మండలాలకు తద్వారా గ్రామాలకు తాగునీరును పంపిస్తారు. కాగా ప్రాజెక్టును ఉమ్మడి తుర్పుగోదావరి జిల్లాల్లో ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజించి మండలాలు వారీగా తాగునీరు అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబందించి తూర్పు గోదావరి జిల్లాలో కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు... కాకినాడ జిల్లాకు సంబంధిం సామర్లకోట, కరప, బిక్కవోలు, పెదపూడి, తాళ్లరేవు, అనపర్తి, కాకినాడ రూరల్ మండలాలు.. కోనసీమ జిల్లాకు సంబంధించి 22 మండలాలలకు మొదటి విడతగా తాగునీరు అందించనున్నారు. ఈస్టన్ డెల్టాకు సంబంధించి కడియం మండలంలో వద్ద ఫిల్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే సెంట్రల్‌డెల్టాకు సంబంధించి ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి 80 కిలోమీటర్లకు 30 నుంచి 40 సెంట్ల స్థలంలో ఒక సంపు, ఒహెచ్ బిఆర్, వాచ్‌మేన్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. ఆ సంపుల నుంచి గొట్టాల ద్వారా వెళ్లిన తాగునీరు గ్రామాల్లో పంపిణీ జరుగుతుంది. గ్రామాల్లో 20 నుంచి 25వేలు జనాభాకు ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి తద్వారా తాగునీరు అందించనున్నారు. అదే విధంగా ఇప్పటికే మండలాల్లో కొనసాగుతున్న తాగునీరు ప్రాజెక్టులను యథావిధిగా ఉంచి ఎప్పుడైనా వాటర్‌గ్రిడ్‌కు సంబంధించి పైపులైన్లకు సంకేతిక సమస్య తలేత్తితే ఈ ప్రాజెక్టును తాత్కాలికంగా ఆయా గ్రామాల్లో తాగునీరు కొరత రాకుండా వినియోగించవచ్చని అధికారులు చెప్తున్నారు. కాగా ఫిల్టర్ యూనిట్‌లు, సంపులకు ప్రస్తుతం భూసే కరణ జరుగుతుందని సంబంధిత అధికారులు చెప్తున్నారు. రెండోదశలో మిగిలిన మండలాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా లంకగ్రామాలకు సైతం తాగునీరుందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అన్నవరం దేవస్థానానికి సరఫరా చేసే దినుసుల్లో

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నందాజీ



టెండర్‌దారులతో సమావేశమైన ఈవో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులు, ఇతర రసవర్గములు సరఫరా చేసే వాటిలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ ఆహారనియంత్రణ అధికారి జీఏబి నందాజీ హెచ్చరించారు. నూతన టెండర్ ద్వారా ఈఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 మార్చి వరకు ఇటీవల పిలిచిన టెండర్లలో తక్కువధరకు కోట్ చేసి టెండరు దక్కించుకున్న టెండర్‌దారులతో ఈవో, దేవస్థానం సిబ్బంది, ఆహారనియంత్రణ అధికారులు బుధవారం సమావేశమయ్యారు. తప్పనిసరిగా ఎఫ్ఎఎస్ ఎస్ఐ, అగ్‌మార్క్ సర్టిఫికేషన్ ఉన్న దినుసులనే సరఫరా చేయాలని, అన్ని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నాణ్యత లేమి సరుకులు సరఫరా చేసి తమ తనిఖీల్లో లోపం కనిపిస్తే వారిపై చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ హెచ్చరించారు. సమావేశంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేశవ దుర్గాప్రసాద్ ఏఈవోలు భాస్కర్, శ్రీని వాస్, అనకాపల్లి ప్రసాద్, పర్వత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో ఆలయాల ఆదాయం

రూ.15.77 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ప్రాచీన ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.15,77,190 ఆదాయం సమకూరినట్టు రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజిరామ్‌ప్రసాద్ తెలిపారు. జూలై 17, 2025 నుంచి ఇప్పటివరకూ శ్రీలక్ష్మీ గణపతి ఆలయాల్లో హుండీలను లెక్కించగా రూ.11,80,790..గోలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.3,96,400 ఆదాయం సమకూరిందన్నారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే చీఫ్ కమర్షిమల్ మేనేజర్ పూజలు

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దక్షణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఐతే పాండే కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో మెమెంటో అందజేశారు.



మేనేజర్‌కు మెమెంటో అందజేస్తున్న ఈవో

కొండెవరంలో పేలిన గ్యాస్ బండ

రూ.2 లక్షల ఆస్తి నష్టం



కొండెవరంలో కాలిన తాటాకిల్లు

కొత్తపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొండెవరంలో మంగళవారం అర్ధరాత్రి గ్యాస్ బండ పేలి భారీ ప్రమాదం జరిగింది. రాయుడు నూకరాజు తాటాకింట్లో అదే గ్రామానికి చెందిన పెంకే సత్తిబాబు కుటుంబసభ్యులతో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ వాసనరావడంతో గుర్తించిన సత్తిబాబు కుమారుడు లేచి చూసేసరికి గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించాడు. అందర్నీ అప్రమత్తం చేయగా పరుగున రోడ్డుకు చేరుకున్నారు. అనంతరం గ్యాస్ బండ పేలడంతో ఇంటి పైకప్పునకు మంటలు వ్యాప్తి చెందాయి. తాటాకిల్లు కాలిపోయింది. ఇంట్లో సామాన్లు కాలిబూడిదయ్యాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఆదేశాలతో బాధిత కుటుంబానికి కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ రూ.25వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ వర్మ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

ఊపిరి పీల్చుకున్న యానాం వాసులు

అదుపులోకి క్లోరిన్‌గ్యాస్ ట్యాంక్



కనకాలపేటలో సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

యానాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యానాం శివారు కనకాలపేటలో ప్రజలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లో మంగళవారం క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకైన విషయం విధితమే. బుధవారం పరిస్థితి అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్థానికులతో కలిసి సంఘటనా జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రతి 4 నెలలకు ఒక సారి క్లోరిన్ ట్యాంక్‌ను మార్చే సమయంలో ట్యాంక్‌కి ఉన్న వాచార్ పగిలిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సంఘటన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి ఇంటింటా నీటి సరఫరా నిలిపివేశారు. బుధవారం ఉదయం మంచి నీటిని కాకినాడ ల్యాబ్‌కు పంపి వచ్చిన రిపోర్టు అధారంగా సాయంత్రం నుంచి నీటి సరఫరా అందించారు. అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారు డిశ్చార్జ్ అయ్యారు. ఇంటింటికి యానాం ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆరోగ్య శాఖ శిబిరానికి రావాలని వారు సూచించారు.



మంచి నీటిని సేకరిస్తున్న సిబ్బంది

యువతి అదృశ్యంపై కేసు

ధవళేశ్వరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధి వీరభద్రరావునగర్ కాలనీ పాత బొమ్మూరుకు చెందిన బెందాడి రాము కుమార్తె శాంతి ప్రియ ధవళేశ్వరం జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఎప్పటిలాగానే ఈనెల 9న తండ్రి రాము కుమార్తెను కళాశాల గేటు వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కళాశాలలో, స్నేహితులు, బంధువులు ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 9440796586, 94919 99336 లో తెలియజేయాలని సీఐ గణేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు కొత్తూరు గురుకుల కళాశాల విద్యార్థులు





చిన్ని, సంతోష్

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): త్వరలో జరగనున్న అండర్ 19 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.రాజు తెలిపారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎంపికల్లో రాష్ట్రస్థాయి పోటీలకు తమ కళాశాలకు చెందిన సీనియర్ ఎంపీసీ విద్యార్థి జక్కుల సంతోష్, జూనియర్ బైపీసీ విద్యార్థి వై.చిన్ని ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులు, పీడీ సతీష్ రాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సమస్యలపై గళం

- అధికారుల పొంతన లేని వివరణలపై జడ్పీటీసీల అసహనం
- కాకినాడలో ఉమ్మడి జిల్లా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలు, సమస్యలపై జడ్పీటీసీలు గళమెత్తారు. అధికారుల పొంతనలేని వివరణలపై అసహనం వ్యక్తం చేశారు. కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయా అంశాల స్థాయి సంఘాలు సమీక్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధి కారు లకు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు.

పూడికతీత పనులు చేపట్టాలి : జడ్పీటీసీలు

ప్రస్తుత ఖరీఫ్, రానున్న రబీ సీజన్‌లకు కాలు వల ద్వారా నీరు సక్రమంగా పంట పొలాలకు అందేలా చూడాలని, అకాల వర్షాల కారణంగా పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఇరిగే షన్ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ఏడోస్థాయి సంఘం చర్చలో భాగంగా ఇరిగేషన్ కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులు, కొత్తగా ప్రతిపాదిం చిన అంశాలు, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న ఇరి గేషన్ పనుల పురోగతిపై అధికారులు సంబంధిత వివరించారు. నాల్గోస్థాయి సంఘం చర్చలో విద్య వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సీజనల్ వ్యా ధుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని సభ్యులు తెలిపారు. అర్బన్ రూరల్ హెల్త్ మిషన్ కింద అవసరమైన చోట పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలను అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అధికారులు పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని వివిధ మండలాల సభ్యులు అధికారులను కోరారు. ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్ర వారం డ్రైడే కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెండో స్థాయి సంఘం చర్చలో గ్రామీణ అభివృద్ధికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, ఉపాధి పనిదినాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్డు ఇరుపక్కల తుప్పలు తొలగించడం, పశువుల షెడ్ల నిర్మాణంపై సభ్యులు అధికారులను వివరాలు కోరారు. ఐదో స్థాయి సంఘం చర్చలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంది ంచాలని సభ్యులు సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా అందించడం ద్వారా రక్తహీనత సమస్యకు గురికాకుండా చూడాలన్నారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామాల్లో సక్రమంగా తాగునీరు, పారి శుధ్య ంపై సూచనలు చేశారు. సంక్షేమ శాఖల చర్చలో వివిధ సంక్షేమ వసతి గృహాల పనితీరున సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చాలని సూచించారు. స్థాయి సంఘాలు చర్చించి సూచించిన అంశాలన్నింటిపై ఉమ్మడి జిల్లాలోని అధికారులు సత్వర చర్యలు చేపట్టి రానున్న సర్వ సభ్య సమావేశంలో పూర్తిస్థాయి సన్నద్ధతతో వివరించాలని జడ్పీ చైర్మన్ కోరారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మూడో స్థాయి సంఘం వ్యసాయ శాఖ చర్చలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యూ రియా కొరత లేకుండా అధికారులకు సూచిం చారు. మోతాదుకు మించి యూరియా ఉపయో గించడం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడు తున్నారని, ఈ విషయమై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. మరో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ అధి కారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు.

అక్షరాంధ్ర ప్రతిజ్ఞ

అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా వయోజన విద్యశాఖ డీఈ పోశయ్యతో కలిసి ఎమ్మెల్సీలు, సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్షరాంధ్ర వయోజన విద్య పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత రామచంద్రపురం జడ్పీటీసీ ఎం.వెంకటేశ్వరరావు అకాల మృతికి చింతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఐదో స్థాయి సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణమూర్తి, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీలు వీర్రాజు, కుడుపూడి, జడ్పీటీసీలు

దొంగలు దొరికారు...

పంచాయతీ కార్యాలయంలో బంధించిన గ్రామస్తులు



గ్రామస్తులకు దొరికిన దొంగలు

రాజానగరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పుగోనగూడెంలో గత కొంతకాలంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై వడిశలేరు రోడ్డు సమీపంలో విటుల వద్దకు వెళ్లి నగదును దోచుకునేందుకు బ్యాగును బలవంతంగా లాక్కుకుంటున్న సమయంలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చేసరికి ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. మరో నలుగురు పొలాల్లోకి దూకి పరారయ్యారు. పట్టుబడిన ఇద్దరికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బధించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ ఇద్దరిని గ్రామస్తులు ప్రశ్నించగా తమది తాళ్లపూడి గ్రామమని మొత్తం ఆరుగురం వచ్చామని, మిగిలిన నలుగురు తప్పించుకుని పారిపోయారంటూ చెప్పారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు.

జ్వరంతో లాగరాయి మహిళ మృతి



మరణించిన జనని (ఫైల్)



జనని కుమారుడితో ఎమ్మెల్యే దంపతులు

రాజవొమ్మంగి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో 3నెలలుగా ప్రజలు అనారోగ్యానికి గురై మంచం పట్టిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆ గ్రామాల్లో పర్యటించి ప్రజలు భయపడొద్దని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయాన్నే లాగరాయికు చెందిన కొంతం జనని (30) జ్వరంతో మృతిచెందింది. జనని ఆగస్టు 30న లాగరాయి ప్రభుత్వాసుపత్రికి వెళ్లిందని, అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఏలేశ్వరం ప్రైవేట్ ఆసుపత్రికి ఆపై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనపై లాగరాయి సర్పంచ్ మిరియాల గన లక్ష్మీ మాట్లాడుతూ లాగరాయి ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందట్లేదని, ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్యసిబ్బంది విఫలమయ్యారన్నారు. అయితే ఏడీఎంహెచ్‌వో డేవిడ్ మాట్లాడుతూ జనని మరణానికి స్క్రబ్ టైఫాస్ పాజిటివ్ కారణమని, ఇది బాగా మురికి కాలువలు ఉండే ప్రాంతంలో మాత్రమే వస్తుందన్నారు. గ్రామాల్లో లక్షణాలు ఉన్నవారి నుంచి శాంపిల్స్ తీసు కుంటావున్నారు. కాగా లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం డీపీవో కార్యాలయ ఏవో సుబ్బారావు తనిఖీ చేశారు.

బాలుడికి అండగా ఎమ్మెల్యే

కొంతం జనని మృతిచెందడంతో ఆమె కుమారుడు సూర్య దీక్షిత్ (7) అనాథ అయ్యాడు. జనని మరణ వార్త తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం లాగరాయిలో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య దీక్షిత్ విద్యాభ్యసం పూర్తయ్యే వరకు తామే తనని చూసుకుంటామని ఎమ్మెల్యే దంపతులు తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. మిషన్ వాత్సల్య ద్వారా ప్రతి నెల బాలుడికి ఆర్థికసాయం అందేలా చూస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించని 14 లారీలపై కేసులు

రౌతులపూడి/తునిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బండరాళ్లు, క్వారీ నల్లమెటల్ తరలిస్తూ భద్రత నిబంధనలు పాటించని లారీలపై కత్తిపూడి వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు కేసులు నమోదు చేశారు. కాకినాడ జిల్లా రౌతులపూడి- తుని మండలం తేటగుంట రహదారిలో అతివేగంగా తిరుగుతున్న 14 లారీలపై కేసులు నమోదు చేసి రూ.85 వేలు జరిమానా విధించారు. ఒక లారీని సీజ్ చేశారు. లారీలు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటంచాల్సిందేనని, ఇకపై ప్రతిరోజూ నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన అధికారుల బృందం

ఐ.పోలవరం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యకల్యాణం పచ్చతోరణంగా బాసిల్లుతున్న కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలోని మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కృషితో ఆలయ నిర్మాణానికి రూ.4కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా దేవదాయశాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పతో కూడిన అధికారుల బృందం బుధవారం వీరేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించింది. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, గాలి గోపురం, చండీశ్వరుడు, నవగ్రహ మండపాల నిర్మాణాలను పరిశీలించింది. ఉప స్థపతి తయారుచేసిన ఆలయ పునర్నిర్మాణ ప్లానును రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించి సూచనలు చేశారు. డీఈఈ, ఉప స్థపతి, సహాయ స్థపతి, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

పామర్రులో అన్నసమారాధన

కె.గంగవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పామర్రులో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద గణపతి నవరాత్రులు ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.

కలెక్టర్‌కు వీఆర్వోల సంఘం పుట్టినరోజు శుభాకాంక్షలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):కలెక్టర్ మహేష్‌కుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం జిల్లా వీఆర్వోల సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్వేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ, వీఆర్వోల సంఘం రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన అల్లవరం మండల పరిషత్ భవనం

- కొత్త భవనానికి మోక్షమెప్పుడో!
- వేరే చోట ఇరుకు గదులతో ఇబ్బందులు


పాడైన మండల ప్రజాపరిషత్ భవనం

అల్లవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిర్మించిన 28ఏళ్లకే అల్లవరం మండల ప్రజాపరిషత్ భవనం శిథిలస్థితికి చేరింది. ఏ క్షణాన అయినా ఈభవనం కూలే ప్రమాదం ఉంది. శిథిలమైన భవనాన్ని తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొత్త భవనానికి మోక్ష ఎప్పుడని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం మండల పరిషత్ కార్యాలయానికి వస్తున్నారు. 1998 జనవరి 4న పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.75లక్షలతో నిర్మించిన అల్లవరం మండల ప్రజాపరిషత్ భవనాన్ని అప్పటి లోక్‌సభాపతి జీఎంసీ బాలయోగి ప్రారంభించారు. దాత నడింపల్లి రామభద్రరాజు ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం జరిగింది. నిర్మాణ లోపమో ఏమో గాని 28ఏళ్లకే కాలం చెల్లి భవనం శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన అయినా ఈభవనం కుప్పకూలే ప్రమాదం ఉంది. భవన పైభాగంలో మొక్కలు మొలిచి అధ్వానంగా మారగా పిల్లర్లు, శ్లాబ్‌లు పెచ్చులూడి ప్రమాద భరితంగా మారింది. దీంతో మండల పరిషత్ కార్యాలయ నిర్వహణను పక్కనున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ భవనంలోకి మార్చారు. అక్కడ కూడా ఇరుకు గదిల్లోనే అధికారులు, సిబ్బంది పనిచేయాల్సి వస్తోంది. ఈశిథిల భవనం తొలగించి కొత్త భవనాన్ని ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం జరగలేదు. కూటమి పాలనలో కొత్త భవనాన్ని నిర్మిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. శిథిల భవనాన్ని తొలగించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శలున్నాయి. కొత్త భవన నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల ప్రజాపరిషత్ కొత్త భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధతీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలస్థితిలో రాజోలు పోలీసు క్వార్టర్స్


పిచ్చిమొక్కలతో ఉన్న పోలీసు క్వార్టర్లు

రాజోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజోలులో పోలీసు క్వార్టర్స్ శిథిలస్థితికి చేరుకున్నాయి. రాజోలులో పోలీసు సర్కిల్ కార్యాలయం సమీపంలో 32మంది కానిస్టేబుళ్లు నివాసం ఉండేలా నాలుగు బ్లాకులుగా 1994లో పోలీసు క్వార్టర్లు నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొద్దిపాటి వర్షానికే క్వార్టర్లు ఆవరణ అంతా ముంపునకు గురవుతుంది. వర్షాలు కురిస్తే భవనాలు, శ్లాబ్‌ల నుంచి వర్షపునీరు లీకవుతుంది. గుమ్మాలకు కిటికీలకు ఏర్పాటుచేసిన తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ పాడవడంతో వాడకపునీరు బయటకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో దుర్భర పరిస్థితి నెలకొంది. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికంగా ఉండేది. ఇవన్నీ భరించలేక 32 కుటుంబాలకు 2015లో ఏడు కుటుంబాలు మాత్రమే క్వార్టర్లలో నివాసం ఉండేవి. ఈసమస్యలన్నీ మరింత అధికమవ్వడం, క్వార్టర్లు పూర్తిగా శిథిలస్థితికి చేరడంతో మిగతా కుటుంబాలు కూడా 2021లో పోలీసు క్వార్టర్ల నుంచి ఖాళీ చేశారు. అప్పటి నుంచి పోలీసు క్వార్టర్ల ఆవరణ అంతా పెద్దపెద్ద పిచ్చి మొక్కలు, తుప్పలతో నిండిపోయింది. పోలీసు క్వార్టర్లు శిథిలస్థితికి చేరడంతో వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించాలని పోలీసు కుటుంబాలు కోరుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లు భాగస్వాములు కావాలి


మురికినీరును సముద్రంలోకి మళ్లిస్తున్న పైపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ, నాయకులు

అంతర్వేది, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ముంపునీటి సమస్య పరిష్కారానికి పైలెట్ ప్రాజెక్టుగా అంతర్వేది గ్రామాన్ని తీసుకున్నట్టు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ అన్నారు. తీర ప్రాంతంలో ముంపునీటినిమోటార్ల సాయంతో సముద్రంలోకి మళ్లించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దేవ బుధవారం ప్రారంభించారు. నాలుగు గ్రామాలు దశాబ్ద కాలంగా ముంపునకు గురవుతున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్ పోతురాజు నరసింహారావు(కిషోర్), ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్దల సహకారంతో ముంపునీటి సమస్య పరిష్కారానికి ప్రయోగాత్మకంగా మోటార్లను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే అన్నారు. కేశవదాసుపాలెం, శంకరగుప్తం డ్రైన్ల అభివృద్ధికి కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందిస్తుంటే, అంతర్వేదిలో ముంపునీటిని సముద్రంలోకి మళ్లించేందుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.25లక్షలతో పనులు మొదలుపెట్టిన రెండు నెలల్లోనే ప్రారంభోత్సవం చేసుకోవడం ఇక్కడ ప్రజల ఐక్యతకు నిదర్శనమన్నారు. రెండు మోటార్లను ఎమ్మెల్యే దేవా స్విచ్ ఆన్ చేసి ముంపునీటి సమస్య పరిష్కారానికి నాంది పలికారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి సముద్రం ఒడ్డున ముంపునీరు తరలివెళ్తున్న దృశ్యాలను పరిశీలించారు. నవంబరు నెలలో రూ.2.30కోట్లతో రాళ్ల కాల్వ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండు బోగుల పెద్దకాపు, నీటిసంఘ అధ్యక్షుడు పిని శెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, సర్పంచ్‌లు పోతుల కిషోర్, కొండా జాన్‌బాబు, అడపా రాంబాబు, పోతుల కృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు బైరా నాగరాజు, చొప్పల బాబురావు, ఉండపల్లి అంజి, బర్రె శ్రీను, బెల్లంకొండ స్వామినాయుడు, దాసరి వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీపై అవగాహన


మాట్లాడుతున్న తహశీల్దార్ సుభాష్

ముమ్మిడివరం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డుల పంపిణీలో వీఆర్వోలు, డీలర్లు, సచివాలయ సిబ్బంది మార్గదర్శకాలు పాటించి వాటిని సక్రమంగా లబ్ధిదారులకు అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తశీల్దార్ పి.సుభాష్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ రేషన్‌కార్డులకు సంబంధించి ప్రతీ రేషన్ షాపునకు రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుని నియమించామన్నారు. మండలంలోని 49రేషన్‌షాపులకు 21,586 స్మార్ట్‌కార్డులు వచ్చాయన్నారు.

ఎరువుల కొరత నివారణకు చర్యలు తీసుకోండి


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని ఎమ్మార్పీకే రైతులకు ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకోలన్నారు. కార్యక్రమంలో డీటీ బి.గోపాలకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.ఉదయభాస్కరవర్మ, వట్టి నాగేశ్వరరావు, వి.రవి, వేగిశన నరసింహరాజు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


పందిరిరాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు

అంబాజీపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పశువుల సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు ధనుష్ పర్యవేక్షణలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల22 నుంచి అమ్మవారి దశమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని అమ్మవారి ఆలయాల వద్ద బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈసందర్భంగా ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలి



ముమ్మిడివరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఆ పథకాన్ని ఉపయోగించుకునే విధంగా కృషి చేయాలని కమిషనర్ పి.రవివర్మ సూచించారు. ముమ్మడివరం నగర పంచాయతీ కార్యాలయంలో రీసోర్స్‌పర్సన్స్‌కు సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం 35శాతం రాయితీ అందిస్తుందన్నారు. నెటమా ప్రాజెక్ట్ డైరెక్టర్ పెంచలయ్య, సీహెచ్.శ్రీనివాసరావు, తాడి నరసింహరావు, నాగలక్ష్మి, సీఎంఎం భాస్కర్, సీఈవో దేవకీ, ఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా.. ఆందోళన వద్దు


దేవగుప్తం రైతు సదస్సులో మాట్లాతున్న తహశీల్దార్

అల్లవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో ఉందని, కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని తహశీల్దార్ ఎంవీవీ.నరసింహరావు అన్నారు. బోడసుకుర్రు, దేవగుప్తం గ్రామాల్లో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతులంతా ఖరీఫ్ వరి సాగులో నానో యూరియాను ఉపయోగించాలన్నారు. మండల వ్యవసాయాధికారి కడలి విజయ్, మండల ప్రత్యేకాధికారి కర్నెడి మూర్తి,సొసైటీ అధ్యక్షుడు వేగిరాజు వెంకటరాజు, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, రొక్కాల విజయలక్ష్మి, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు యూరియా వాడాలి?

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కిత్తనచెరువులో బుధవారం నియోజకవర్గ అభివృద్ధి అధికారి, డ్వామా ఏపీడీ రాంబాబు ఆధ్వర్యంలో రైతులకు పైరుపై యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. సార్వా సీజన్‌లో పైరుపై ఎన్నిసార్లు, ఏవిధంగా, ఎంత మోతాదులో యూరియా వినియోగించాలో అధికారులు వివరించారు. మోతాదుకు మించి యూరియా వినియోగిస్తే మొక్కలో కణజాలం బాగా విస్తరించి ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిల్లా జగదీశ్వరి, నీటి సంఘం చైర్మన్ బండారు వెంకన్నబాబు, సొసైటీ చైర్మన్ సాకా రాంబాబు పాల్గొన్నారు.

యూరియాపై అవగాహన సదస్సు

కాట్రేనికోన,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉప్పూడిలో బుధవారం రైతులకు యూరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. యూరియా కొరత ఉందని రైతులు తెలిపారు. మార్కెట్‌లో నానోయూరియా అందుబాటులో ఉందని, 2,3విడతల్లో నానో యూరియా వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల, నీటిసంఘం చైర్మన్ బండారు ఏసు, రంబాల సుభాష్‌చంద్రబోస్, రంబాల దొరబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు రీజెన్సీ విద్యార్థులు


క్రీడాకారులతో రీజెన్సీ ప్రతినిధులు

యానాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి రెండు రోజులు కరైకాల్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు యానాం రీజెన్సీ పబ్లిక్ స్కూల్ నుంచి 9మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. అండర్ -14 బాలికల చెస్ విభాగంలో మల్లాడి శశి వర్షిత, ఒంటెద్దు సుప్రియాంక, బాలుర విభాగంలో కొల్లు సాత్విక్ మణికంఠ, సాధనాల యువన్ సంతోష్, వజ్రపు నిశాంత్ కుమార్, అండర్-17 బాలికల విభాగంలో కోడి వేద హర్షిని, సాధనాల లాస్య కమలని, బాలికల యోగా విభాగంలో పట్టా దాక్షిణ్యలు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు బొట్టా శ్రీనివాస్‌ను అభినందనలు తెలిపారు.

గణపతి నిమజ్జనం

ముమ్మిడివరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ హైస్కూల్ సెంటర్లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మార్కెట్ గణపతి వర్తక సంఘం అధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, గరికపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని మురమ్మళ్ల గోదావరి నదీ జలాల్లో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నసమారాధనలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

ముమ్మిడివరం,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): సమ్మె కాలపు ఒప్పందంపై డిమాండ్లను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ఆరోపించారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో బుధవారం అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్ల యూనియన్ ముమ్మిడివరం ప్రాజెక్టు రెండో మహాసభ ఎస్.దుర్గామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా కె.కృష్ణవేణి, జి.దుర్గాప్రసాద్ మాట్లాడారు.సమస్యలపై అంగన్‌వాడీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు పెంచకుండా ఉద్యమాన్ని అణిచివేయాలని చూడటం సరైంది కాదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎస్.దుర్గామహేశ్వరి, కార్యదర్శిగా ఎం.జయలక్ష్మి, కోశాధికారిగా కె.అరుణ, మరో పది మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎస్.కనకదుర్గ, టి.శ్రీదేవి, జి.హైమావతి, జి.అనంతలక్ష్మి, సీహెచ్ మంగాలక్ష్మి, తలుపులమ్మ, అమ్మాజి, రత్నకుమారి, విజయ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


స్వామివారి ఫొటో అందిస్తున్న దృశ్యం

అయినవిల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకివీడుకు చెందిన కోసరాజు శివకుమార్ కుటుంబ సభ్యులు అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందించి శేషవస్త్రంతో సత్కరించారు.

12వ పీఆర్సీని తక్షణం నియమించాలి

అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు సాయివరప్రసాద్


పెన్షనర్లను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ పెన్షనర్లకు తక్షణం 12వ పీఆర్సీ నియమించాలని, తక్షణం సహాయంగా 30శాతం ఇంటీరియర్ రిలీఫ్(ఐఆర్) మంజూరు చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఎం.సాయివర ప్రసాద్ అన్నారు. అమలాపురం పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సంఘ కార్యదర్శి కేకేవీ నాయుడు మాట్లాడుతూ ఇన్‌కం ట్యాక్స్ ఈ-రిటర్న్ ఈనెల15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 70ఏళ్ల పైబడిన ఫ్యామిలీ పెన్షనర్స్ అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరవుతున్నది లేనిది పరిశీలించుకోవాలన్నారు. అనంతరం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో ఆదినారాయణ, కె.పద్మావతి, కనిగినీడి ఉదయ్‌భాస్కర్, యం.శ్రీరామచంద్ర మూర్తి, ఎ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు


ఆదుర్రులో దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మామిడికుదురు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు పంచాయతీ కార్యదర్శులు బివివి సత్యనారాయణ, జి.వాసు తెలిపారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఎబెట్ మందును ఆదుర్రు, పాశర్లపూడి గ్రామాల్లో బుధవారం పిచికారి చేశారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురికినీటి గుంటల్లో మందును పిచికారి చేసి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, బళ్ల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు కొమ్మూరి ఉమామహేశ్వరరావు, కొమ్ముల సూర్యనారాయణ, ఏఎన్‌ఎం వైకేడీ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి 23వేల స్మార్ట్ రేషన్‌కార్డులు

పి.గన్నవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 41రేషన్ షాపులకు 23,399 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయని తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో డీలర్లు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కార్డులు పంపిణీ ప్రారంభించిన తరువాత షాపుల వారీగా డీలరు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి డీలరు విధిగా ఈ-పౌరసరఫరాల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకో వాలని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం అనంతరం గొంది గ్రామానికి చెందిన కలిదిండి చిన వెంకటరామరాజు, ఉమాపార్వతి దంపతులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేలు విరాళం అందించారు. అనంతరం దాతలకు ఆలయ సహాయకమిషనర్ ఎంకేటీఎన్‌వి ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


అప్పనపల్లిలో పౌష్టికాహారం అందిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో విజయశ్రీ

మామిడికుదురు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): పిల్లలు, బాలింతలు, గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో వై.విజయశ్రీ కోరారు. బుధవారం అప్పనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సఖీవన్ స్టాప్ సెంటర్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఏ.అంబికాదేవి వివిధ రకాల విభాగాల ప్రతినిధులలో కలిసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల2నుంచి 12వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉచిత విద్య, ఉచిత రక్షణ, ఉచిత న్యాయసహాయం, ఉచిత వసతి, ఉచిత కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లుగా తెలిపారు. మహిళలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించే విధంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల అందజేత

పి.గన్నవరం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తండ్రి,విశ్రాంత హెచ్‌ఎం కె.వెంకటసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం మంగళవారం హెచ్‌ఎం కేవీ సత్యనారాయమూర్తి మానేపల్లి బాలికోన్నత పాఠశాలకు రూ.10వేలు విలువైన 20జతల స్పోర్ట్స్ దుస్తులు అందించారు. పాఠశాల చైర్మన్ కొమ్ముల రమాదేవి ఈదుస్తులను విద్యార్థులకు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఏ అంకిత్‌కుమార్‌ను కలిసిన నవోదయ ప్రిన్సిపాల్

యానాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌ను యానాం జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.కీర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంరతం నవోదయకు సంబంధించిన అంశాలను వివరించారు.

టీడీపీ నాయకుడు జకార్రాజు విగ్రహావిష్కరణ


జకార్రాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన మెట్ల రమణబాబు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలేనికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు జంపన సూర్యనారాయణరాజు(జకార్రాజు) వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహావిష్కరణ జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు జకార్రాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. జకార్రాజు నిబద్ధత గల నాయకుడని వక్తలు వ్యాఖ్యానించారు. జకార్రాజు చారిటబుల్ ట్రస్టు తరపున ఆయన కుమారుడు లయన్ సుమన్‌వర్మ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. అమలాపురం లయన్స్ క్లబ్, కిమ్స్ కళాశాల, మెడ్ యునైటెడ్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో 400 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, నియోజకవర్గ బీసీ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు, చీకట్ల నాని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి, లయన్ అనీల్‌కుమార్, పీఏస్ శర్మనాయకులు పాల్గొన్నారు.

సబ్‌జూనియర్ సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థినులు

అంబాజీపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు 28వ సబ్‌జూనియర్ సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాయిరాం, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. అమలాపురంలో సోమవారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ -13 సబ్‌జూనియర్స్ జట్టుకు పాఠశాలకు చెందిన జానకీ, కావ్య, నాగశ్రీ, గీతికలు ఎంపికయ్యారు. ఈనెల13,14వ తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని పాఠశాల పీఈటీలు, ఎ.ఉమామహేశ్వరరావు, అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్ర స్థాయిసెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పంటకాల్వ ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఐ.పోలవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ పంటకాల్వ ఆక్రమణలపై ఐలాండ్ రైతులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తొలుత కొమరగిరి రోటరీ క్లబ్ భవనంలో రైతులు, సొసైటీల అధ్యక్షులు, నీటి సంఘాల ప్రతినిధులు సమావేశమై ఆక్రమణలపై చర్చించారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని పంటకాల్వ చెంతన ఉన్న షాపుల నిర్వాహకులు చెత్తాచెదారం వేసి కాల్వ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణల కారణంగా మురమళ్ళ- గుత్తెనదీవి పంటకాల్వ ద్వారా సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని రైతులు ఆవేదన చెందారు. కలెక్టర్‌కు ఆక్రమణల అంశంపై రైతులు వివరించారు. సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మికి అభినందనలు



రాజోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన కేతా వెంకటలక్ష్మికి బుధవారం నాటక అకాడమి డైరెక్టర్ బందెల పద్మ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవిలు తాటిపాక ఆమె నివాసంలో కలిసి పూలబొకే అందజేసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ కాకి లక్ష్మీ, అడబాల రమాదేవి, బొక్కా పృధ్వీ, చిట్టూరి సంతోష్, యనుమల శ్రీధర్, కొప్పిశెట్టి సాయి, చెల్లింగి శ్రీను తదితరులు ఉన్నారు.

శనేశ్వరస్వామి ఆదాయం రూ.10లక్షలు

కొత్తపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు హుండీలను దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. సుమారు 8 నెలల 11 రోజులకు శనేశ్వరస్వామి హుండీ రూ.8,80,131, ప్రాంగణంలోని అన్నప్రసాద ట్రస్టు వేణుగోపాలస్వామి హుండీ కలిపి రూ.1,25,874 వెరశి రూ.10,06,005 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. ఈ లెక్కింపు జిల్లా దేవదాయ శాఖాధికారి వీడీఎస్ ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, గ్రామ పెద్దలు సాదు చంచయ్య, గ్రామ కార్యదర్శి, వీఆర్వో, పలువురు సేవా వలంటీర్లు పాల్గొన్నారు.


శనేశ్వర ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం



రామచంద్రపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న అఖిలపక్ష జేఏసీ

రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలి

అఖిలపక్ష జేఏసీ ప్రదర్శన

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిపారు. స్థానిక రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలని వారు నినాదాలు చేశారు. ప్రదర్శన అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు మాగాపు అమ్మిరాజు, బి.సిద్ధూ, బార్ అసోసియేషన్ నాయకులు వుండవిల్లి గోపాలరావు, సీపీఐ నాయకురాలు శారద, బీజేపీ నాయకుడు కొట్టువాడ హరిబాబు, టీడీపీ నాయకుడు చందమామ వాసు, శిరిగినీడి దుర్గా ప్రసాద్, జమతే ఇస్లాం హిందా అధ్యక్షులు ఫరీద్ అహ్మద్, రామచంద్రపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పసుపులేటి సత్తిబాబు, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అలీ, కౌన్సిలర్లు అంకం శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట శ్రీనివాస్, రైతుకూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


చెల్లూరు అగస్తేశ్వరస్వామి ఆలయం వద్ద పందిరిరాటకు పూజలు చేస్తున్న దృశ్యం

నవరాత్రి వేడుకలకు శ్రీకారం

రాయవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): చెల్లూరు అగస్తేశ్వరస్వామి ఆలయం వద్ద 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం పందిరిరాట పూజతో శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకుడు యలమంచిలి వీర భాస్కర సత్య సాయి ప్రసాద్ అర్చకత్వంలో ఆలయ ఛైర్మన్ దాలిపర్తి పాపారావు చేతుల మీదుగా ఉదయం 10.12 గంటలకు వినాయకపూజ, రాట పూజలు జరిపి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వల్లూరి సత్యప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం

ఆలమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి సేవలు అభినందనీయమని పలువురు వక్తలన్నారు. ఇటీవల ఆయన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సందర్భంగా బుధవారం కాలేజీ ఆవర ణలో ఆయన్ను సత్కరించారు. కాలేజీ అభివృద్ధి కమిటీ, అధ్యాపక బృందం, విద్యార్థులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ అభి వృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు, నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, ప్రధాన కార్యదర్శి జి.త్రిమూర్తులు, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, సూర్యారావుపేట మాజీ సర్పంచ్ కె.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

మండపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం గ్రామంలో వైసీపీకి గట్టి షాక్ తగులుతోంది. గ్రామానికి చెందిన పలువురు ఇప్పటికే వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే ఎస్సీ, బీసీ సంఘీయులు టీడీపీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో కేశవరానికి చెందిన బీసీ సంఘ నాయకులు బుధవారం స్థానిక నేతలు యు.సురేష్ సారథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీ కార్యాలయంలో 25 మంది తెలుగుదేశంలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నరమామిడి రామకృష్ణ, తంపర అప్పారావు, వెంటూరి వీర్రాజు అప్పారావు, వీరహనుమంతు, వెంటూరి వీర్రాజు, శీలం వెంకట్రావు తదితరులు వున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండపేట మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, ఉండమట్ల గోపి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

రాయవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంపర వేణుగోపాల సింగుబాబు ఇటీవల తెలుగుతేజం అవార్డుతో పాటు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వెదురుపాకలో సింగుబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పామర్రులో అన్న సమారాధన

కె.గంగవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు గ్రామంలో బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద గణపతి నవరాత్రులు ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని బుధవారం అన్న సమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.


వాడపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

ఘనంగా చతుర్థి పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంకష్టచతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అర్చక స్వాములు గణపతికి ప్రత్యేక అభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పెదపళ్ల గణపతి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

భక్తి శ్రద్ధలతో చతుర్థి పూజలు

ఆలమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసం సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం మండలంలోని ఆయా గణపతి ఆలయాల్లో చతుర్థి పూజలు నిర్వహించారు. పెదపళ్ల, ఆలమూరు, చింతలూరు, సంధిపూడి, పినపళ్ల, మోదుకూరు, నర్సిపూడి, మడికి, చొప్పెల్ల జొన్నాడ తదితర గ్రామాల్లోని గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, స్వామివారికి ప్రాతఃకాల అభిషేకాలు, గరిక అర్చనలు చేశారు. ఆయా ఆలయాల్లో గణపతి హోమాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


తెలుగు టీచర్ శ్రీదేవిని సత్కరిస్తున్న దృశ్యం

తెలుగు అధ్యాపకురాలికి డాక్టరేట్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలు కాకుమాను శ్రీదేవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కనుపర్తి వరలక్ష్మమ్మ రచనలు, పరిశీలన అంశంపై మట్టా విజయశ్రీ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన పత్రానికి డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యేను కలసిన కమ్మ శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు

మండపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన మేకా సూర్యభాస్కరరావు బుధవారం ఎమ్మెల్యే వేగుళ్లను పార్టీ కార్యాలయంలో కలిశారు. తనకు డైరెక్టర్ పదవి వచ్చేందుకు సహకరించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గజ్జారపు కల్యాణ్ కుమార్, యండ్రు సత్యనారాయణ మూర్తి తదితరులు వున్నారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ మాచవరపు విజయ కూడా ఎమ్మెల్యేను కుటుంబ సమేతంగా కలిశారు. తనకు డైరెక్టర్ పదవి వచ్చేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి

కె.గంగవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): డెంగూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత అవసరం అని కళాజాత బృందం సభ్యుడు ఎం.రమేష్ అన్నారు. బుధవారం పామర్రు ఉన్నత పాఠశాలలో ఈ బృందం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచరలో బుధవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్ నివారణ పట్ల అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్.వెంకట్రావు, జోనల్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు, లింక్ వర్కర్ కె.సుజాత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మారేడుబాకలో రేషన్‌కార్డుల పంపిణీ

మండపేట, సెప్టెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విడుదల చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను గురువారం మారేడుబాకలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని మండపేట తహసీల్దార్ టీ.తేజేశ్వరరావు తెలిపారు. మారేడుబాక రేషన్ దుకాణం వద్ద రేషన్‌దారులకు స్మార్ట్‌కార్డులు అందజేస్తారని ఆయన తెలిపారు.

మద్యం సేవించి పట్టుబడితే కోర్టుకే..

• వాహనదారులకు పోలీసుల హెచ్చరికలు • విస్తృత తనిఖీలు చేస్తామని వెల్లడి

మండపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అధికంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయన్న ఆరోపణ లున్నాయి. మద్యం మత్తులో ముందున్న వాహనాలను ఢీకొట్టడం లేదా డివైడర్లు, చెట్లను ఢీకొట్టడం చేస్తున్నట్టు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఆయా రోడ్డు ప్రమాదాల్లో 45 ఏళ్లలోపు కలిగిన వారే ఎక్కువగా ఉంటున్నట్టు పోలీసు యంత్రాంగం పేర్కొంటోంది. ఈ ప్రమాదాల్లో ఎక్కువ భాగం మద్యం సేవించి వాహనాలు నడపటం వల్లే సంభవిస్తున్నాయని పోలీసుశాఖ నివేదికలో స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంలో తరచూ దాడులు, తనిఖీలు చేస్తున్నప్పటికీ మద్యం మత్తులో ప్రమాదాలు జరుగుతూనే వున్నాయని పోలీసు వర్గాలంటున్నాయి. దీంతో పోలీసు యంత్రాగం డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. మద్యం సేవించి వాహనంతో పోలీసులకు పట్టుపడితే న్యాయస్థానానికి పంపి రూ.10వేలు జరిమానా పడేలా చేస్తున్నారు. తరచూ పట్టుబడినా, అధిక మోతాదులో తాగి వాహనం నడిపినట్టు న్యాయమూర్తి భావిస్తే జైలుశిక్ష విధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న ఆయా పోలీసు స్టేషన్‌ల్లో ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నారు. వాహనాలు నడిపే వారికి బ్రీత్ అనలైజర్లు పెడుతూ నూటికి 30 శాతం రీడింగ్ వస్తే మద్యం తాగి వాహనం నడినట్టుగా గుర్తించి వారి వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. వారిపై కేసు నమోదు చేసి మరుసటి రోజు కోర్టుకు హాజరు పరుస్తున్నారు. తొలివిడత పట్టుబడితే పోలీసులు రూ. 10వేలు జరిమానా విధిస్తున్నారు. అతిగా మద్యం సేవించి వాహనం నడిపినట్టు రీడింగ్‌లో బయటపడినా లేదా తరచూ మద్యం తాగి వాహనం ఎక్కినట్టు గుర్తించినా రెండు నుంచి వారం రోజులపాటు జైలుశిక్షను మందుబాబులకు విధిస్తున్నట్టు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.



రైతులకు అందుబాటులో యూరియా

అవగాహన సదస్సులో ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆత్రేయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులకు కావలసిన యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుందని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహరావు పేర్కొన్నారు. బుధవారం అంకంపాలెం గ్రామరైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యూరియా వాడకం, లభ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియాపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భార్గవ మహేష్, సర్పంచ్ ముత్తాబత్తుల రాజు, అభ్యుదయ రైతు కుదప కృష్ణమూర్తి, తెలుగు రైతు మండల అధ్యక్షుడు కరుటూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): యూరియా లభ్యతపై బుధవారం మండలంలోని కేదార్లంక, అద్దంకివారిలంక, తాతపూడి, కపిలేశ్వరపురం, గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఏవో బి.రవి పాల్గొని మాట్లాడారు. రబీసాగు అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటు లో ఉన్నట్టు తెలిపారు.మార్కెట్‌లో నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, వ్యవసాయశాఖ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీపై వైసీపీ అసత్యాలను ప్రచారం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే ఎక్కువ యూరియాను కూటమి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీ చేస్తుందన్నారు. ప్రజలను మభ్యపెట్టి రాజకీయ లబ్ధిపొందాలనుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, మండల ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): యూరియా తగినంత ఉందని రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ పి.శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మండల వ్యవసాయశాఖ అధికారి ఏ. సద్గురుమూర్తితో కలిసి అద్దంపల్లి, దంగేరు, కోటిపల్లి, యర్రపోతవరం, గుడిగళ్ల భాగలలో యూరియా లభ్యతపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి మాట్లాడుతూ యూరియా పై సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం రామాలయం వద్ద స్మార్ట్‌కార్డుల పంపిణీ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు కార్డులు అంద జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో 92,151 మం దికి స్మార్ట్‌కార్డులు అందించామన్నా రు. వృద్ధులు, వికలాంగులకు ప్రతినెల 5 రోజులు ముందుగా వారి ఇం టికి రేషన్ అందుతుందన్నారు. కార్య క్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ప్రత్యేకాధికారి బీవీ రమణ, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, కేతా శ్రీను, జక్కంపూడి వెంకటస్వామి, కొవ్వూరి కృష్ణారెడ్డి, పెచ్చెట్టి చిన్నారావు, చిన్నం శ్రీనివాసరెడ్డి, కోట సోమేష్ పాల్గొన్నారు.


రావులపాలెంలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఇంటింటా సర్వేల నుంచి విముక్తి కలిగించాలి

కె.గంగవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా సర్వేల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించాలని మండల సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంటింట సర్వేలను వ్యతిరేకిస్తూ గతంలో నిరసన తెలియజేసినా అధికారులు వాటిని చేయాలని ఇచ్చిన ఆదేశాలను వ్యతిరేకిస్తున్నా మన్నారు. ప్రభుత్వ విధానాలకు తాము వ్యతిరే కం కాదని, ఇంటింట సర్వేల నుంచి తమకు విముక్తి కలిగించాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం పరిపాల నాధికారి సురేంద్రరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు సచివాలయా నుంచి వచ్చిన సిబ్బంది పాల్గొన్నారు.


పరిపాలనాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులు పరిశీలన

ఆత్రేయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులను ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు. శ్రీనివాస ప్రాంగణంలోని వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులతో పాటు ఆలయం ఎదురుగా నిర్మిస్తున్న పుష్కరిణి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. తదనంతరం సీసీ రోడ్ల నిర్మాణం, రూ.50 క్యూలైన్ల విస్తరణ పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఉపకమిషనరు

పరిసరాల శుభ్రతే ఆరోగ్యానికి రక్ష

ఆత్రేయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని డీఎల్‌డీవో టి.రాజేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో వెంకటరామన్‌తో కలిసి వసంతవాడలో పర్యటించారు. తడి పొడిచెత్తను సేకరిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు, సచివాలయ సెక్రటరీ హరికృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.


వసంతవాడలో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

హోమియోపతి వైద్య విద్యలో విద్యార్థినికి బంగారు పతకం

రాయవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సోమేశ్వరం గ్రామానికి చెందిన గుంటూరు దుర్గాదేవి హోమియోపతి వైద్య విద్యలో గోల్డ్ మెడల్ సాధించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన బీహెచ్‌ఎంఎస్ పరీక్షల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సమక్షంలో పతకం అందజేశారు.


వెదురుపాక లక్ష్మి గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా లక్ష్మి గణపతి ఆలయ వార్షికోత్సవం

రాయవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెదురుపాక ఇందిరమ్మ కాలనీలో ఉన్న లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వేద పండితులు ఇంటికిరాల సుబ్రహ్మణ్యశర్మ, అర్చకుడు అంగర జనార్థనాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వినాయకుడికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు, గరిక పూజతో పాటు, హోమం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యశర్మ, జనార్థనాచార్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా త్రినాథరావు

ఆత్రేయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కొత్తపేట నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా కట్టుంగకు చెందిన దొడ్డపనేని త్రినాథరావు నియమితులయ్యారు. లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం తెలుగు రైతు కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ర్యాలికి చెందిన గార్లపాటి గోపి నియోజకవర్గ సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కమిటీల ఎంపిక నిర్వహించారు. పదవులు పొందిన వారిని పలువురు అభినందించారు.

పంటకాల్వ ఆక్రమణలపై ఫిర్యాదు

ఐ.పోలవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మురమళ్ల పంటకాల్వ ఆక్రమణలపై ఐలాండ్ రైతులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తొలుత కొమరగిరి రోటరీ క్లబ్ భవనంలో రైతులు, సొసైటీల అధ్యక్షులు, నీటి సంఘాల ప్రతినిధులు సమావేశమై ఆక్రమణలపై చర్చించారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని పంటకాల్వ చెంతన ఉన్న షాపుల నిర్వాహకులు చెత్తాచెదారం వేసి కాల్వ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఆక్రమణల అంశంపై రైతులు వివరించారు. సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.